

## శేఖర్ కమ్ముల కొత్త చిత్రం

హృద్యమైన ప్రేమకథలతో పాటు సామాజిక సమస్యలను ఇతివృత్తాలుగా తీసుకొని సినిమాలు తీస్తూ సెన్సిబుల్ డైరెక్టర్‌గా పేరు తెచ్చుకున్నారు శేఖర్ కమ్ముల. ప్రస్తుతం ఆయన అగ్ర హీరోలు నాగార్జున, ధనుష్‌లతో భారీ మల్టీస్టారర్ చిత్రాన్ని తెరకెక్కిస్తున్న విషయం తెలిసిందే. శ్రీవెంకటేశ్వర సినిమాస్, అమిగోస్ క్రియేషన్స్ నిర్మిస్తున్నాయి. ప్రస్తుతం చిత్రీకరణ జరుగుతున్నది. తాజాగా శ్రీవెంకటేశ్వర సినిమాస్ బ్యానర్‌లో శేఖర్ కమ్ముల మరో చిత్రాన్ని చేయబోతున్నారు. ప్రస్తుతం ఈ సినిమాకు సంబంధించిన ప్రీప్రొడక్షన్స్ పనులు జరుగుతున్నాయని, భారీ బడ్జెట్‌తో తెరకెక్కిస్తామని నిర్మాణ సంస్థ ప్రకటించింది. ఈ చిత్రానికి సంబంధించిన మరిన్ని వివరాలను త్వరలో వెల్లడించనున్నారు. ఈ చిత్రానికి నిర్మాతలు: సునీల్ నారంగ్, పుస్కూర్ రామ్మోహన్ రావు, దర్శకత్వం: శేఖర్ కమ్ముల.

# రొమాంటిక్ సాంగ్ వింటూ...

'ప్రేమమ్' సినిమాతో తెలుగు చిత్రసీమలో అడుగుపెట్టిన మలయాళ ముద్దుగుమ్మ అనుపమ పరమేశ్వరన్. అందానికి తోడు అద్భుత నటన, ఆకట్టుకునే అభినయం, ఆశ్చర్యచకితులను చేసే హావభావాలు పలికించడంలో తనకు తానే సాటి ఈ భామ. తనకు ఇచ్చిన పాత్రల్లో ఒదిగిపోతూ తెలుగు, తమిళ, మలయాళ ప్రేక్షకులకు దగ్గరైందీ అమ్మడు. ప్రధానంగా మలయాళం, తెలుగు చిత్రాలపై దృష్టి సారిస్తుంటుంది. మూడేళ్ల తర్వాత తమిళంలో ఆమె నటించిన తన మూడో సినిమా 'సైరెన్'. ఈ చిత్రంలో జయం రవి, కీర్తి సురేశ్ ప్రధాన పాత్రలు పోషిస్తుండగా, ఆంటోనీ భాగ్యరాజ్ దర్శకత్వం వహిస్తున్నారు. ఈ సినిమాకు చెందిన ఫస్ట్ సింగిల్ జనవరి 29న విడుదలైంది. 'నేట్రు వరై'.. అంటూ సాగే ఈ రొమాంటిక్ సాంగ్ లిరిక్స్ సగటు ప్రేక్షకుల మదిని తట్టిరేపుతున్నాయి. తమరై సాహిత్యం అందించగా, సిధ్ శ్రీరాం ఆలపించారు. ఈ 'నేట్రు వరై' గీతాన్ని జోడిస్తూ పెళ్లి కూతురు గెటప్‌లో ఉన్న ఫొటోలను ఇన్‌స్టాలో పోస్ట్ చేశారు అనుపమ పరమేశ్వరన్. ''పెళ్లికూతురుగా 'నేట్రు వరై' వింటూ కొంచెం ఉత్సాహంగా ఉన్నప్పుడు'' అనే క్యాప్షన్‌తో ఉన్న ఆ ఫొటోలు ప్రస్తుతం నెట్టింట వైరల్ అవుతున్నాయి. ఈ సొగసరికి చెందిన రెండు తెలుగు (ఈగల్, టిల్లు స్క్వేర్), ఒక తమిళ (సైరెన్) సినిమాలు విడుదలకు సిద్ధంగా ఉన్నాయి. రవితేజ, కావ్యా థాపర్, అనుపమ పరమేశ్వరన్ తదితర తారాగణంతో కార్తీక్ ఘట్టమనేని దర్శకత్వంలో తెరకెక్కిన 'ఈగల్' ఫిబ్రవరి 9న థియేటర్ల ద్వారా ప్రేక్షకుల ముందుకు వస్తున్నది. దర్శకుడు మల్లిక్ రామ్ రూపొందించిన మరో చిత్రం 'టిల్లు స్వేర్'లోనూ ఆమె సిద్ధు జొన్నలగడ్డతో జతకట్టింది.



# కన్నప్ప కోసం కసరత్తులు

మంచు విష్ణు టైటిల్ రోల్‌ని పోషిస్తున్న పాన్ ఇండియా చిత్రం ' కన్నప్ప'. ముఖేష్ కుమార్ సింగ్ దర్శకత్వం వహిస్తున్నారు. ఈ సినిమాలో మోహన్‌లాల్, మోహన్‌బాబు, ప్రభాస్ వంటి అగ్ర తారలు భాగమవుతున్నారు. ప్రభాస్ శివుడి పాత్రలో నటిస్తున్నట్లు వార్తలొస్తున్నాయి. ఇటీవల న్యూజిలాండ్‌లో లాంగ్ షెడ్యూల్ పూర్తి చేసుకున్న చిత్ర బృందం ఇండియాకు తిరిగొచ్చింది. తాజా సమాచారం ప్రకారం ఈ నెల రెండోవారంలో మొదలయ్యే తాజా షెడ్యూల్‌లో ప్రభాస్ జాయిన్ కాబోతున్నట్లు తెలిసింది. భారీ స్థాయిలో తీర్చిదిద్దిన సెట్‌లో ప్రభాస్‌పై కీలక ఘట్టాలను తెరకెక్కించబోతున్నట్లు సమాచారం. తన పాత్ర కోసం ప్రభాస్ ఇప్పటికే కసరత్తులు పూర్తి చేశారని, ఇంటర్వెల్‌కు ముందు వచ్చే ఆయన పాత్ర సినిమాకు హైలైట్‌గా నిలుస్తుందని చెబుతున్నారు. అతిథి పాత్ర అయినా కథాగమనంలో కీలకంగా ఉంటుందని సమాచారం. ప్రస్తుతం ప్రభాస్ 'కల్కి' 'రాజా సాబ్' చిత్రాలతో బిజీగా ఉన్నారు.



## 'ధీర' యాక్షన్ మూవీగా మెప్పిస్తుంది



విక్రాంత్, లక్ష్, దిల్‌రాజు, చదలవాడ శ్రీనివాస రావు, గోపీచంద్ మలినేని

లక్ష్ చదలవాడ హీరోగా తెరకెక్కిన చిత్రం 'ధీర'. తిరుమల తిరుపతి వెంకటేశ్వర పతాకంపై పద్మావతి చదలవాడ నిర్మించారు. విక్రాంత్ శ్రీనివాస్ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ సినిమా ఈ నెల 2న విడుదల కానుంది. ఈ సందర్భంగా మంగళవారం చిత్రం ప్రీ రిలీజ్ ఈవెంట్‌ను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దిల్‌రాజు, గోపీచంద్ మలినేని, త్రినాథరావు నక్కిన ఈ సినిమాకు చెందిన బిగ్ టికెట్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా దిల్ రాజు మాట్లాడుతూ.. 'శ్రీనివాస్ గారు ఎంతో మంది చిన్న నిర్మాతలకు సాయం చేశారు. ఫిలిం ఛాంబర్ ఎలక్షన్స్‌లోనూ నాకు సహాయం చేశారు. 'ధీర' టీజర్ బాగుంది' అన్నారు. నిర్మాత చదలవాడ శ్రీనివాసరావు మాట్లాడుతూ 'తండ్రిగా లక్ష్‌ను చూసి గర్విస్తుంటాను. నేను తీసిన 'రికార్డ్ బ్రేక్' అనే గ్రాఫిక్స్ సినిమా మార్చిలో రాబోతోంది. సునీల్‌కుమార్‌రెడ్డితో హిందీలోనూ ఓ సినిమా చేస్తున్నాను. కేఎస్ నాగేశ్వరరావు 'నా కనురెప్పవు నువ్వేరా' కూడా రెడీగా ఉంది. మా ప్రొడక్షన్స్‌లో 16 సినిమాలు సిద్ధంగా ఉన్నాయి. ఇండస్ట్రీని ఏకతాటిపైకి తీసుకురావాలన్న ఇరవై ఏళ్ల నా కలను దిల్ రాజు గారు నెరవేర్చారు' అన్నారు. హీరో లక్ష్ మాట్లాడుతూ 'సినిమా కథ గురించి ఇప్పుడేం చెప్పలేం. పక్కనోడిని పట్టించుకోని ఓ వ్యక్తికి ఓ మిషన్ అప్పగిస్తే ఎలా ఉంటుందో 'ధీర'లో చూడొచ్చు. యాక్షన్ మూవీగా మెప్పిస్తుంది' అని చెప్పారు. 'ఇంత పెద్ద బ్యానర్ నుంచి దర్శకుడిగా పరిచయం అవుతాననుకోలేదు. ఒళ్లు దగ్గర పెట్టుకొని 'ధీర' కథ రాసుకున్నాను' అని చిత్ర దర్శకుడు విక్రాంత్ శ్రీనివాస్ తెలిపారు.



ధీరజ్, సుహాస్, అడివి శేష్, శివాని, దుశ్యంత్

## ధమ్ బిర్యానీ లాంటి సినిమా

చెప్పాలని ఉంది, అలాంటి సిత్రాలు, శాకుంతలం చిత్రాల ద్వారా ప్రతిభావంతుడిగా గుర్తింపును సంపాదించుకున్నాడు యువ హీరో యష్ పూరి. ఆయన తాజా చిత్రం 'హ్యాపీ ఎండింగ్'. కౌశిక్ భీమిడి దర్శకత్వం వహించిన ఈ చిత్రం ఈ నెల 2న విడుదలకానుంది. ఈ సందర్భంగా యష్ పూరి పాత్రికేయులతో మాట్లాడుతూ 'మన పురాణాల్లోని శాపాలు అనే కాన్సెప్ట్‌తో ఈ సినిమాను తెరకెక్కించాం. నేటితరం యువకుడు శాపం బారిన పడితే అతని పరిస్థితి ఏమిటనే అంశాన్ని వినోదాత్మకంగా చూపించాం. సినిమాలో నా పాత్ర పేరు హర్ష్. శాపాల వల్ల తను ఇబ్బంది పడుతూ ప్రేక్షకుల్ని నవ్విస్తాడు. చివరి 15 నిమిషాలు మాత్రం భావోద్వేగభరితంగా అనిపిస్తాయి' అన్నారు. ఈ సినిమాలో ఎలాంటి అడల్ట్ కంటెంట్ ఉండదని, ఫ్యామిలీతో కలిసి హాయిగా సినిమా చూడొచ్చని చెప్పారు యష్ పూరి. ఇక ప్రేమ అనే అంశాన్ని కూడా కవితాత్మక, ఆధ్యాత్మిక అంశాల కలబోతగా చూపించామని అన్నారు. 'ప్రేమకథ చాలా కొత్తగా అనిపిస్తుంది. హీరో శాపగ్రస్తుడు కాబట్టి అతని ప్రేమ వ్యక్తీకరణ పొయెటిక్ ఫీల్‌తో ఉంటుంది. ప్రేమ, ఎమోషన్స్, డ్రామా..ఇలా అన్ని అంశాలు కలిగిన ధమ్ బిర్యానీ లాంటి సినిమా ఇది' అని యష్ పూరి తెలిపారు. కమర్షియల్ హీరోగా రాణించాలన్నదే తన లక్ష్యమని, కెరీర్‌లో కాస్త స్థిరపడిన తర్వాత పక్కా మాస్ సినిమాలు చేస్తానని ఆయన పేర్కొన్నారు.



యష్ పూరి



## సుందరం మాస్టర్ వినోదం

హర్ష చెముడు, దివ్యశ్రీపాద ప్రధాన పాత్రల్లో నటిస్తున్న చిత్రం 'సుందరం మాస్టర్'. కల్యాణ్ సంతోష్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని హీరో రవితేజ, సుధీర్‌కుమార్ కుర్రు నిర్మిస్తున్నారు. ఈ చిత్రాన్ని ఫిబ్రవరి 23న రిలీజ్ చేయబోతున్నట్లు మేకర్స్ తెలిపారు. 'ఒక గ్రామంలో ఇంగ్లీష్ బోధన కోసం వెళ్లిన ఉపాధ్యాయుడి కథ ఇది. మిర్యాలమెట్ట అనే మారుమూల గ్రామానికి ఇంగ్లీష్ టీచర్‌గా వెళ్లిన సుందరం మాస్టర్‌కు అక్కడ ఎలాంటి పరిస్థితులు ఎదురయ్యాయనేది ఆద్యంతం చక్కటి వినోదాన్ని పంచుతుందని చిత్రబృందం పేర్కొంది. ఈ చిత్రానికి కెమెరా: దీపక్, సంగీతం: శ్రీచరణ్ పాకాల, నిర్మాణ సంస్థలు: ఆర్‌టీ టీమ్ వర్క్స్, గోల్ డెన్ మీడియా, రచన-దర్శకత్వం: కల్యాణ్ సంతోష్.

# ఆ విషయంలో బాధపడ్డా!

'సీతారామం' చిత్రంతో తెలుగు ప్రేక్షకులకు చేరువైన మరాఠీ భామ మృణాల్ ఠాకూర్ ప్రస్తుతం భారీ సినిమాల్లో నటిస్తూ బిజీగా ఉంది. ఇటు తెలుగుతో పాటు బాలీవుడ్‌లోనూ సత్తాచాటుతున్నది. కెరీర్ ఆరంభం నుంచి కథాబలమున్న చిత్రాల్లో నటించే అవకాశం రావడం ఆనందంగా ఉన్నా..ఆ తరహా సినిమాల్లో డ్యాన్స్‌కు స్కోప్ లేకపోవడంతో తాను బాధపడ్డానని చెప్పింది మృణాల్ ఠాకూర్. ఇటీవల ఇచ్చిన ఓ ఇంటర్వ్యూలో ఆమె మాట్లాడుతూ 'హృతిక్‌రోషన్‌తో 'సూపర్ 30'లో నటించా. తను మంచి డ్యాన్సర్. అయితే ఆ సినిమా ఎడ్యుకేషన్ నేపథ్య కథాంశం కావడం వల్ల డ్యాన్స్‌కు ఆస్కారం లేకుండా పోయింది. 'జెర్సీ' సినిమాలో షాహిద్‌కపూర్‌తో కలిసి నటించాను. ఆ సినిమాలో కూడా నృత్యాలకు అంతగా ప్రాధాన్యత లేదు. మంచి డ్యాన్సర్స్ అయిన హీరోల పక్కన డ్యాన్స్ చేసే అవకాశం రాలేదని చాలాసార్లు బాధపడ్డా. అందుకే తెర వెనక డ్యాన్సులు చేస్తూ సోషల్‌మీడియాలో అభిమానులతో పంచుకుంటాను' అని చెప్పింది. ప్రస్తుతం ఈ భామ తెలుగులో విజయ్ దేవరకొండ సరసన 'ఫ్యామిలీ స్టార్' చిత్రంలో నటిస్తున్నది. ఈ సినిమాలో నృత్యాలకు చాలా ప్రాధాన్యత ఉందని చెప్పుకొచ్చింది మృణాల్ ఠాకూర్.



## 'మిస్ పర్ఫెక్ట్' రొమాంటిక్ కామెడీ



బిగ్‌బాస్ ఫేమ్ అభిజీత్ నటించిన వెబ్ సిరీస్ 'మిస్ పర్ఫెక్ట్'. ఇందులో లావణ్య త్రిపాఠి హీరోయిన్. అభిజ్ఞ ఉతలూరు మరో కీ రోల్ చేశారు. అన్నపూర్ణ స్టూడియోస్ బ్యానర్‌పై సుప్రియ యార్లగడ్డ నిర్మించారు. విశ్వక్ ఖండేరావ్ దర్శకత్వంలో రూపొందిన ఈ సిరీస్ ఫిబ్రవరి 2 నుంచి డిస్నీప్లస్ హాట్‌స్టార్‌లో స్ట్రీమింగ్ కానున్నది. ఈ సందర్భంగా ఈ సిరీస్ హైలైట్స్‌ను హీరో అభిజీత్ వివరించారు. 'మిస్ పర్ఫెక్ట్‌లో నాది హీరో క్యారెక్టర్. పాత్ర పేరు రోహిత్. చాలా బద్ధకస్తుడిగా కనిపిస్తా. రియల్ లైఫ్‌లో రోహిత్‌లాంటి క్యారెక్టర్స్‌ను చాలా చూశాను. నా ఫ్రెండ్సూ ఉన్నారు. ఇష్టంగా ఉద్యోగం చేయలేక.. బిజినెస్‌తో రిస్క్ చేయలేక సంఘర్షణలో ఉండిపోతారు. వయసు 40 దాటితే అసలే రిస్క్ చేయలేరు. రొమాంటిక్ కామెడీ సిరీస్ ఇది' అని తెలిపారు.

# మీకిష్టమైన సినిమా ఇదే.. ప్రామిస్!

సుహాస్ హీరోగా తెరకెక్కిన సినిమా 'అంబాజీపేట మ్యారేజి బ్యాండు'. శివాని నాగరం కథానాయిక. ఈ చిత్రాన్ని జీఏ2 పిక్చర్స్, మహాయన మోషన్ పిక్చర్స్, ధీరజ్ మొగిలినేని ఎంటర్‌టైన్‌మెంట్ పతాకాలు సంయుక్తంగా నిర్మిస్తున్నాయి. దుశ్యంత్ కటికినేని దర్శకత్వం వహించిన ఈ సినిమా ఈ నెల 2న ప్రేక్షకుల ముందుకు వస్తున్నది. మంగళవారం హైదరాబాద్‌లో ఈ చిత్ర ప్రీ రిలీజ్ ఈవెంట్ నిర్వహించగా, హీరో అడివి శేష్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా చిత్ర దర్శకుడు దుశ్యంత్ మాట్లాడుతూ 'నేను ఇండస్ట్రీకి వచ్చి పదేళ్లవుతోంది. ఇన్నేళ్లలో ఎన్నో త్యాగాలు చేస్తేనే ఈ స్థాయికి చేరుకున్నా. త్యాగాలకు ఫలితం సినిమా సక్సెస్ ద్వారా దొరుకుతుందని ఆశిస్తున్నా. సుహాస్ లేకుంటే నేను డైరెక్టర్ అయ్యేందుకు ఇంకా ఎన్నేళ్లు పట్టేదో తెలియదు' అన్నారు. నేను నిర్మాతగా ఎదిగేందుకు అల్లు అరవింద్ గారు, శిరీష్ గారు, బన్నీ వాసు గారు కారణం. ప్రతి విషయంలో మాకు గైడెన్స్ ఇచ్చారు' అన్నారు చిత్ర నిర్మాత ధీరజ్ మొగిలినేని. హీరో సుహాస్ మాట్లాడుతూ 'నేను గీతా ఆర్ట్స్‌లో హీరోగా చేస్తున్నానంటే మా పేరెంట్స్ నమ్మలేదు. అంతటి అవకాశమిచ్చిన బన్నీ వాసు గారి ప్రోత్సాహం మరువలేనిది. ఫిబ్రవరి 1నే పెయిడ్ ప్రీమియర్స్ వేస్తున్నాం. మీకిష్టమైన సినిమాల్లో 'అంబాజీపేట మ్యారేజి బ్యాండు' ఉంటుందని ప్రామిస్ చేస్తున్నా' అన్నారు.





